# అక్కయ్య

★ ఎస్ ఆర్. నంది ★

అక్కయ్యంటె ఏమిటో రాము కంత ప్రేమ!

అక్కయ్య ఒక్కక్షణం కనిపించకపోతే పిచ్చెత్తినట్టు యిల్లంతా గాలించేస్తాడు. అమ్మ అడుగుతున్నా సరే వినిపించుకోకుండా. అన్ని తలుపు మూలల్నీ, ఈ బీరువా పక్కల్నీ ఆతృతతో చూస్తాడు - అక్కయ్య తన్ని తిప్పలు పెట్టాలని ఏ మూలనన్నా నక్కివుందేమోనని. చివరికి డాబా మీదికిగూడ - పడిపోతానేది కానకుండా - గబగబా ఎక్కి చూసేస్తాడు. చివరికి అక్కడే ఆమె దొరుకుతుంది

"అక్కాయ్" అంటూ ఆమె ఒళ్లో వాలిపోతాడు,

ఆమె, తమ్ముడు తలని ఆప్యాయంగా నిమురుతూ ప్రొద్దుటినుంచి స్కూల్లో మాస్టర్లు ఎలాంటి ప్రశ్నలు వేసేవారో, వాట్లకి ఏ విధంగా తమ్ముడు జవాబు లిచ్చేవాడో అడుగుతుంది. అక్క ఆ ప్రశ్న వేయడమే తడవుగా, ఒళ్లోంచి లేచిపోయి తన ప్రతాపాన్ని గుక్కతిప్పుకోకుండా చెప్పేస్తాడు, తన తమ్ముణ్ణి మాస్టర్లందరూ ప్రేమతో చూట్టానికి, రాత్రులు తను తనపక్కని తమ్ముణ్ణి కూచోబెట్టుకొని పాఠాలన్నీ స్వయంగా నేర్పిస్తుండబట్టే, అదంతా తన ప్రజ్ఞవల్లే అనే పరవశత్వంలో వూగిపోయేది.

ఆవాళ రాము, స్కూల్నించి వచ్చీరాగానే పుస్తకాలు బల్లమీద విసిరేసి మేడమీదికి పరుగెత్తి ఒక్క వూపులో అక్క ఆలింగనలోకి చొచ్చుకపోయాడు, తర్వాత అక్క ముఖాన్ని తన చేతులతో ఎత్తుతూ ఆమె కళ్ళల్లోకి నవ్వుతూ చూశాడు.

"అక్కాయ్! నీకు పెళ్ళవుతుందట. ఎప్పుడు?. అసలు పెళ్ళంటె ఏవిటక్కాయ్" అని అమాయకంగా అడిగాడు.

"ఛా" అని కనుబొమలు చిట్లిస్తూ తమ్ముణ్ణి కౌగిలించి విదిలించేసుకొంది

ఇంకా రాము నవ్వుతూనే వున్నాడు వాడి చిల్లిబుగ్గల నవ్వుని చూడగానే, ఆమె తిరిగి తమ్ముణ్ణి దగ్గరకి తీసుకొంటూ, పాలబుగ్గలమీద ముద్దుపెట్టుకొని "నీకీ సంగతి ఎవరు చెప్పారు తమ్ముడూ!" అంది.

"అమ్మ పొద్దుట చెప్పింది. అప్పుడే చిన్న తగాలని నీ దగ్గరకొచ్చాను నువ్వు పాట పాడగానే ఆ మాట మరచిపోయాను. స్కూల్లో జ్ఞాపకమొచ్చి బుచ్చిగాడితో 'మా అక్కకి పెళ్ళవుతుందిరా' అన్నా..."

"వాడితో ఎన్నెవరు చెప్పమన్నారు!" కోపంగా అంది.

"ఏమక్కాయ్ చెబితే! వాళ్ళక్కాయ్కిగూడ అవుతుందన్నాడు- తర్వా—"

"ఛా! వూరుకో. ఊరంతా చాటించేస్తున్నావన్నమాట"

"లేదక్కాయ్. వాడొక్కడితోనే చెప్పాను— అక్కాయ్! పెళ్ళంటే ఏవిటే!"

"అదుగో వొద్దంటుంటె మళ్ళా అదే అంటున్నావ్! అయితే మాటాడొద్దు. ఊఁ"

"ఊహుఁ, లేదక్కాయ్. ఇంక ఏమీ అనను" అక్కయ్యచేతులు పట్టుకొని బతిమాలాడు,

"సరె, ఇక ఆ మాట విడిచిపెట్టు—ఒక

పాట పాడుతాను విను" అని తమ్ముడు చెక్కిలి మీద ఒక చిటుకవేసింది.

తను అడిగిన ప్రశ్నకి జవాబు రాకపోవడం తో రాము హృదయం కొస్త బాధపడ్డా అక్క పాడుతుండవగానే ఇహ ఆ మాట మరచి, అక్క మృదుకంఠంవించి వెలువడబోయే శ్రావ్య గీతికమీద వూహాగానం చేయడం మొదలు పెట్టాడు.

సన్నవిరాగం వెలువడింది. రాము శరీరం ఒక్కసారి జలదరించింది. మంత్రముగ్ధుడులా అక్కకేసి తేరిపారి చూస్తున్నాడు. ఆమె, తమ్ము డు పురివేస్తున్న నయనాలదృష్టిలోకి తీక్షణంగా చూస్తో మెల్లగా పాడుతోంది. రాము క్షణక్షణా నికి మారిపోతూ చివరికి అక్క ఒళ్లో వాలి పోయాడు వెర్రిగా అక్కకేసే చూస్తున్నాడు ఆ అక్క అలా పాడుతూ యుగయుగాలు వుండి పోతే ఎంత స్వర్గం!

పాట అయిపోయింది తమ్ముణ్ణి ఎత్తుకొని ముద్దులాడి కిందికి దిగిపోయింది మెట్లు దిగు తూ అక్క నడుంచుట్టూ చేతులువేసి గట్టిగా పట్టుకొనే ఏవేవో గుక్క తిప్పుకోకుండా అడి గాడు. ఆమెని సమాధానమవ్వాక సరిగా చెప్ప నిచ్చేవాడు కాదు.

కిందికి దిగిన తర్వాత వసారాలో తమ్ముడికి స్వయంగా అన్నం గిన్నెలోపెట్టి తినిపించింది. కాని పక్కనే అక్కగూడ మరోకంచంలో అన్నం వడ్డించుకుని తినేవరకూ రాము ఒప్పుకోలేదు. రాత్రి అక్కపక్కని కూచొని పాఠాలు చదువు కొని తర్వాత ఆమె చెబుతున్న కథని వింటూ అక్కపక్కలో నిద్రపోయాడు

అమ్మ వున్నప్పటికీ అక్కదగ్గరే చేరికెక్కు వ. అమ్మలో లేని ఆకర్షణ, అక్కలో వాడికి అనుపించింది. అదీగాక అమ్మ అక్కలా అంత సన్నగా పాడలేదు కథలుగూడ చెప్పలేదు. ముఖ్యంగా తను అక్కదగ్గరకి చేరడానికి కార

ణం అక్కగూడ తనలాగే గెంతుతూ, ఆడు తూ నవ్వుతూ వుండడమే.

చివరికి అక్కకి మరి మూడునెలల్లో పెళ్ళయి పోయింది. పెళ్లిలో అక్క చాల అందంగా వుండేది. ఇంతకుముందుకంటెగూడ ఆనందంగా వుండేది. కాని ఇంతకుముందులా ధైర్యంగా తన్ని కౌగలించుకొని ముద్దులాడ్డం లేదు. ఏదో సిగ్గుతో తన పాలాన్ని వృశించేది. అస్పష్టంగా ఏవో మాటలనేది అవి మాటలు కాదు, మెల్లని రాగాలు! అక్క వాటిని గట్టిగా పైకి పాడుతుం దేమో అని ఆశతో అలవాటుప్రకారం దీక్షగా ఆమె గొంతుకలోకి చూస్తుంటె నవ్వుతూ పాట ఆపి "తమ్ముడూ" అని గట్టిగా హృదయానికి హత్తుకొనేది.

ఆవాళరాత్రి కళ్ళకి సన్నగా కాటుక రాస్తే నిజంగా అక్క ఎంత సౌందర్యంగా మెరసి పోయింది! పసుపురాసిన పాదాలమీద సౌభాగ్య సింధూరాన్ని చూసి, రాము, ఆ కాళ్ళల్లో తలపెట్టి, అలా జన్మజన్మలు వుండిపోవాలనుకొన్నాడు. ఆ పీతాంబరంలోని అక్కని చూసి ఎంతో మురిసి పోయాడు. కాని అక్క తన్నివిడిచి బావతో అత్తారింటికి వెళ్ళిపోయింది.

అక్కయ్య వెళ్ళిపోతున్నపుడు ఏడ్చాడు. "ఎప్పుడు తిరిగొస్తావక్కాయ్ మళ్లా?—పోనీ నేనూగూడ నీతో వచ్చేస్తాను. నన్నూ తీసుకపో అక్కాయ్" అని కళ్ళనీటిని తుడుకొంటూ అన్నా డు. అక్క: "దీపావళికి తప్పకుండా వస్తాను తమ్ముడూ" అని ధైర్యం చెప్పింది. అయినా సరే రాము హృదయంలో పూర్తి ధైర్యం కలగలేదు.

అక్క వెళ్ళిపోయిన తర్వాత అమ్మ దగ్గరే చదువుకొనేవాడు. కాని అమ్మ అక్కంత బాగా- చెప్పేది కాదు. దీపంముందు కూచొని పుస్తకం విప్పేసరికి పుస్తకంలో అక్కయ్యముఖం అగు

పించేది. వెంటనే తలెత్తి అమ్మ నడిగేవాడు. "దీపావళి యింకా ఎన్నాళ్లుందమ్మా?"

"తొందరపడితే ఎలా? మరో నెల కళ్లు మూసుకో. దీపావళి దానికదే వచ్చేస్తుంది" అనేది అమ్మ

ఒకనెలరోజులు కళ్లుమూసుకోవాలి? ఎలా? కళ్లు మూసుకొంటె అక్కముఖం యింకా స్పష్టంగా అగుపించేది. కళ్లు తెరిస్తే అప్పటికప్పుడే ఎంతోదూరం వెళ్ళిపోయినట్టనిపించేది తిరిగి కళ్లు మూసుకొనేసరికి అక్కపాట వినిపించేది

తెల్లవారి లేవగానే అక్కఫోటో అగుపించేది "ఆ ఫోటో దగ్గరకి వెళ్ళి గంటలు తరబడి దాన్నే చూస్తూ వుండిపోయేవాడు అప్పుడు రాము కళ్ళముందు అక్క చిత్రంకాదు అగుపించేది. నిజంగా అక్కయ్యే! గట్టిగా కౌగలించుకొనేవాడు. కాని అక్క మృదుశరీరం తనకి తగలకపోగానే కళ్లువిప్పి చూసేవాడు—ఎదురుగా ఏమీ వుండేదికాదు ఒక్క అక్కఫోటో తప్పించి!

దీపావళి దగ్గరికొచ్చేస్తోంది. ఒక్కో నిముషం జరుగుతున్నకొద్దీ అక్క రాకకి కాలం చేరువకి వచ్చేస్తోంది. ఆ సంతోషంలో రాము స్నేహితులందరితో "మా అక్కరేపు వచ్చేస్తోంది" అని చెబుతూ గెంతుతున్నాడు కాని అక్క రేపు రాకపోవడంతో, ఆ రేపుకి నిర్వచనాన్ని. పగలు తర్వాత రాత్రి, రాత్రిపోగానే పగలు పవరించుకొంటూ ఆశతో మర్నాటికి తన దృష్టిని సారించేవాడు.

రేపు దీపావళి అక్క ఇంకారాలేదు. ఒక్క ఉత్తరమన్నారాయలేదు. అయినా రాముకి అక్క తప్పకుండా వస్తుందనే ఆశే! క్షణం గడుపగానే 'అదిగో అక్క' అనుకొనేవాడు. వీధిచివర ఏ బండీ అగుపించకపోగానే 'ఆఁ, మరోక్షణంలో రాదా' అంటూ తృప్తిపడేవాడు. ఇంతలో ఒక ఉత్తరాన్ని పోస్టుమేన్ వచ్చి యిచ్చాడు.

అమ్మ వుత్తరాన్ని తీసుకొంది అది చదువుతున్నంతసేపూ, రాము అమ్మప్రక్కన నిలబడి నవ్వుతుంటూ అమ్మ ముఖంలోకి చూస్తున్నాడు. ఆ వుత్తరం తప్పకుండా అక్కయ్య దగ్గరనుంచే అయివుంటుంది. అక్కయ్యే రాసివుంటుంది.. అమ్మచేతిలోని వుత్తరం కంపించిపోతోంది రాము రాము కళ్లు క్షణక్షణానికి చెదిరిపోతున్నాయి.

"ఎక్కడినించి? అక్కయేకదూ రాసింది. ఏ—మ్మా?" అని అడిగాడు రాము.

ఆమెకు కొడుకు అడిగినమాట సరిగా వినిపించలేదు పిచ్చిగా అరచుకొంటూ నాన్న దగ్గరకి లోపలికి వెళ్ళిపోయింది అమ్మప్రవర్తన రాముకి ఏమీ అర్థంకాలేదు వెళ్ళిపోతున్న అమ్మ కేసి అలా తేరపారి చూస్తూ వుండిపోయాడు.

కాస్సేపటిలో నాన్న లోపలినుంచి గబగబా బయటకు వెళ్ళిపోయారు రాముకంతా అగమ్యగోచరంగా వుంది అయితే ఆ వుత్తరంలో అక్కయ్య ఏమని వ్రాసింది?...ఏమో వూహించలేకపోతున్నాడు అంతలో నాన్న ఒక బండి తీసుకవచ్చారు. అందరూ దాన్లో ఎక్కారు బండిలో వున్నంతసేపు అమ్మ కంటనించి నీళ్ళే!

స్టేషన్‌కి చేరుకున్నారు. నాన్న మూడు టిక్కట్లు కొనితెచ్చారు కాసేపట్లో రైలు వచ్చింది ఎక్కారు రైలులోగూడా, అమ్మ ఒక్కమాట మాటాడలేదు నాన్న ముఖంలో ఎడారిగాడ్పులు వీస్తున్నట్లే వున్నాయి. కళ్లు అగ్గినిప్పుల్లా జ్వలించిపోతున్నాయి ఏమిటో యిదంతా! ఎక్కడికి వెళుతున్నదిగూడా రాముకి అర్థంగావటంలేదు.

రాత్రి తొమ్మిదవుతుందనగా అనూరు చేరుతున్నాము స్టేషన్ చిన్నది కావటంమూలాన రెండో మూడో దీపాలున్నాయి. రాము ఆ స్టేషన్ పేరు చూడాడుగాని ఆ మసగ కాంతిలో అక్షరాలు సరిగా అగుపించలేదు అక్కయ్యుం

మరో అరగంటలో రెండెడ్ల బండిమీద అవూరు చేరుతున్నారు గ్రామం పొలిమేర చూడగానే రాము అనుమానించాడు: అక్కయ్య యింటికి కాదుకదా? అని. అక్కయ్యని సాగనంపేటప్పుడు తను అక్కతో అత్తవారింటికి రాలేదు. అమ్మ ఒక్కతే అక్కని దిగబెట్టి వొచ్చేసింది. అప్పటి నించి ఆరునెలలు గడిచాయి,

ఒక యింటిముందు బండి ఆగిన తర్వాత అందరూ దిగి లోనికివెళ్లారు. లోపల ఒక మంచం ప్రక్కన ఒక స్త్రీ నిలబడి ఆముదం దీపం ఒత్తి ఎత్తుతోంది. అమ్మ ఆమెని చూడగానే 'జానకీ' అని గట్టిగా కేకేసి ఆమెదగ్గరకి పరుగెత్తింది

ఆమె తలెత్తింది. ఆ ముఖాన్ని రాము చూశాడు, కొద్దిసేపు తికమక పడ్డా, తర్వాత ఆమె తన అక్కయ్యే అని గుర్తించాడు ఆమె 'జానకి' అనేపిలుపు వినగానే వెర్రిదానిలా పరుగున వచ్చి 'అమ్మా' అంటూ అమ్మని గాఢంగా కౌగలించుకొని భోరుమంది

అక్కయ్య అమ్మని కౌగలించుకోగానే రాము మెల్లగా అక్క పక్కకి చేరుతున్నాడు. ఆమె తిరిగిచూసి, అమ్మని వొదిలి తమ్ముణ్ణి ఒక్కసారి కౌగలించుకొంది ఉక్కిరి బిక్కిరై పోయాడు. తర్వాత తమ్ముణ్ణి తీసుకొని జానకి లోపలికి వెళ్ళి పోయింది.

జానకి తమ్ముణ్ణి తీసుకొని మంచంమీదకూచో పెట్టింది. ఇప్పుడామె కళ్ళనించి నీళ్లు రావటం లేదు. నవ్వుతూ తమ్ముణ్ణి ముద్దులాడింది.

"రాజమండ్రి రాలేదేమక్కాయ్?" అమాయక ప్రశ్న వేశాడు

తమ్ముడామాటలనగానే జానకి నవ్వుపెదాల్లో అలానే యింకిపోయింది అపును ఎందుకు రావాలి? పెళ్ళవగానే స్త్రీ భర్తే సర్వం అయి పోతాడు, ఇక తన పుట్టింట్లో అమ్మ, నాన్న, అక్క, తమ్ముడు, చెల్లెలు ఎవరూ జ్ఞాపకం రాగూడదు. భర్తలో నిజమయిన ప్రేమ్యుంటె స్త్రీ నిజహృదయాన్ని గుర్తించగలడు. కాని జానకి భర్త గొప్ప చదువు చ దు వు కొ న్న మూర్ఖుడై. ముట్టుకొంటె కందిపోయే ఆ పూల శరీరాన్ని రోజూ రక్తాలు కారేట్టు బాద బాదు తాడు. పుట్టింటికి వెళతానంటె చిత్రవధ చేసేస్తా నంటాడు. అత్తమామలు మంచివారైనా, స్త్రీపట్ల తన బాధ్యతని గుర్తించలేని భర్త దగ్గర జానకి జీవితం నరక ప్రాయంగా వుంది.

పండుగ వచ్చింది స్త్రీ గాబట్టి జా న కి హృదయం అమ్మమీదకి, నాన్న, తమ్ముల మీదికి పోయింది. ఆవేళ ఆసంగతి అతనితో చెప్పింది. కాని అతను ఒప్పుకోలేదు మళ్ళాడు మళ్లా అడిగింది, పర్యవసానం బావుదెబ్బలు ! జానకి కిరకిర్లాడింది. ఎంతోసేపు తలబాదుకొని వెక్కివెక్కి ఏడ్చుతుంది, అమ్మ జ్ఞాపకానికి వచ్చింది. తమ్ముడు కళ్ళముందు క ది లా డు. ఒక్కగుద్దుతో ఏనుగలని గూడ చంపేయగల నాన్న హృదయంలో మెదిలాడు. ఇవన్నీ ఎదలో మెదలగానే జానకి మరింత కుమిలిపోయింది. వెంటనే నాన్నకి త్వరగా రమ్మని ఒక్క ఉత్తరం రాసింది.

ఇప్పుడు నాన్న, అమ్మని చూడగానే లక్ష మంది అప్సరల్ని ఒక్కసారి చూసినట్టు తల్లి మంది ఆ పక్కనే చిన్నతమ్ముణ్ణి చూడగానే తనబాధనంతనీ మరచిపోయి. వాణ్ణి గాఢంగా కౌగలించుకొని లోనికి తీసుకపోయింది, వాడికేం తెలుసు, తనిలాంటి కష్టాలనుభవిస్తున్నట్టు? అమా యకంగా అడిగాడు. 'రాజమండ్రి రావక్కాయ్' అని. ఆ రావటం ఎప్పుడో తనకేతెలియంది సమాధానమేమని చెబుతుంది?

"ఒక పాటపాడవక్కాయ్? నీ పాటవిని చాల రోజులయ్యింది'' రెండో అమాయక ప్రశ్న వేశాడు.

జానకి ఒక్కసారిగా పూగిపోయింది. ఏ గొంతుకతో పాడాలి తమ్ముడూ? ఇంతకముందులా తన సర్వ తంత్రుల్లో మధుర గానాలు లేవు అవి ఆయన చేతిలో నలిగిపోయాయి. ఆ కంఠం అతని కరకు చేతులతో పిసకబడింది. గొంతుక బొంగురుపోయింది, పాట పాడలేదు పాడినా తమ్ముడు వినలేదు.

అంతలో అమ్మ, నాన్న అక్కడికి వచ్చారు అమ్మ జానకి పక్కన కూచుని ఆప్యాయంగా తల నిమురుతూ కన్నీరు విడుస్తోంది

"చంద్ర ఏడీ?" నాన్న ప్రశ్నించారు. ఆ స్వరంలో చిన్నతనం నించి తన కూతుర్ని పెంచిన మమత ఆవేశంతో పొర్లిపోతోంది.

"కాసేపటిలో వస్తారు, నాన్నా"

"అసలేం జరిగిందో నాతో చెప్పమ్మా?" అని అమ్మ మెల్లగా అడిగింది

జానకి అశ్రుస్వరంతోనే అంతా చెప్పింది నాన్న కోపంతో పళ్లు పటపటకొరికారు. ఎదురుగా చంద్రం వుంటే అమాంతంగా వాడి పీక నులిమేసేవాడే? కాని స్తిమితపడ్డాడు మెల్ల మెల్లగా సహజత్వాన్ని కోలుకొన్నాడు. "కాస్త దబ్బు కళ్ళపడగానే మనపెందుకంత దుర్బలమై పోతుంది? ఇంటో భార్యవుండగా వెధవకా కోతి మూతి ముండల కొంపల్లో దేవులాడే బతుకెందుకంట? బి ఏ చదివాడు! ఎందుకు? జ్ఞానంలేంది" అనుకుంటూ కుర్చీలో కూలబడ్డాడు

అంతలోనే చంద్ర తూలుతుంటూ లోపలికి వచ్చాడు. నాన్న దూకుడుగాలేచి, గట్టిగా ఏదో అడిగారు అసలు చంద్ర ఎవర్నీ గుర్తించే స్థితిలోనే లేడు. ఇక అతన్ని యిప్పుడేమన్నా లాభం లేనని నాన్న తన కోపాన్ని దిగమింగుకొన్నారు

తెల్లవారిన తరువాత చంద్రం మామూలుగా లేచాడు ఇంట్లో అత్తమామలని చూడగానే అశ్చర్యపోయాడు. రాత్రి జరిగిన సంగతులు అతనికి ఒకటిగూడా జ్ఞాపకంలేవు. మామగారు దగ్గరగా వచ్చి తన ప్రవర్తన ఏమీ బాగులేదని కష్టంగా అన్నప్పుడు చంద్ర ముఖం మాడిపోయింది. ఇంకా ఆయన ఆగకుండా నాలుగు మాట లనడంతో అతను, అవల తలుపుచాటునున్న జానకి కేసి చురచుర చూస్తూ "మీకంత ప్రేమ పొర్లుకు పోతోంటే, మీ కూతుర్ని మీరు తీసుకపోండి. ఇక ఇక్కడికి పంపకపోయినా ఫర్వాలేదు" అంటూ చరచరా బయటికి వెళ్ళిపోయాడు,

చంద్ర వింత ధోరణికి నాన్న తెల్లపోయాడు, అతన్ని అమ్మ బతికిమాలబోయిందిగాని ఆ మాటలు వినిపించుకొనే స్థితిలో లేడు

అమావాస్య చీకటయినప్పటికీ ఆవేళ సర్వ దినం గాబట్టి తనింటికి కూతుర్ని తీసుకువెళ్లాలని, ఎలాగయినా అల్లుణ్ణి ఒప్పించాలని అమ్మ నాన్న వచ్చారు కాని వాళ్ళ ఆశలు నిరాశ లయిపోవడంతో అమ్మ కంటనించి నీళ్లు ఝల్లున రాలాయి

"ఏ మయితే అయ్యింది, జానకిని మనం తీసుకపోదాం. అప్పుడుగాని వెధవకి బుద్ధిరాదు" అని నాన్న. జానకిని తనతో వచ్చేయమన్నప్పుడు, అమ్మ దూరమాలోచించి అప్రయత్నాన్ని మాన్పించింది

పర్యవసానం పండగనాడు కూతుర్ని అక్కడే విడచిపెట్టి, వచ్చినలాగే బండిమీద తిరుగు ప్రయాణం!

ఇంటికి తిరిగి వచ్చేటప్పుడు రాము అక్కయ్యని ఎన్నోసార్లు ముద్దుపెట్టుకొన్నాడు అక్కతన్ని ముద్దుపెట్టుకొనే బదులు అసలు అక్కే ఏమీ సంతోషంగా లేదు. బావగూడ ఏమీ మాటాడాడు కాదు—అక్క పూర్తిగా మారిపోయింది,

ఇంటికి చేరుకొన్న మరి నాలుగురోజుల్లో రాము అమ్మని అడిగాడు "అక్కదగ్గరికి మళ్లా ఎప్పుడు వెడతామమ్మా?" అని.

ఆమె లేచి నవ్వుని తెచ్చుకొని కొడుకుని ప్రేమగా ముద్దుపెట్టుకొంటూ; "ఈసారి మనం వెళ్ళ నవసరంలేదు నాన్న. అక్కయ్యే యిక్కడికి వస్తుంది" అంది.

రాముకి మొదట్లో ఈ మాటమీద నమ్మకం కలక్కపోయినప్పటికీ, తర్వాత తర్వాత బుచ్చిగాడుకూడా "మా అక్కయ్యబావతో కలసి మళ్లా పెద్దపండక్కి తప్పకండా వస్తుంది" అన్నపుడు, తన అక్కగూడ పండక్కి బావతో కలసి తప్పకండా వస్తుందని నమ్మాడు

డిశంబర్ అయిపోయింది. జనవరి కొత్త సంవత్సరం వచ్చింది భోగిపండక్కి చాల సరదాగా మంటవేసుకోవచ్చు అక్క స్వయంగా తలంటి నీళ్లు పోస్తుంది, పిండివంటలు ఎన్నో చేస్తుంది. పక్కన కూచోబెట్టుకొని పాయిసం తాగిస్తుంది. పండక్కి కొత్తబట్టలు వేసుకొంటాడు అక్కయ్యే స్వయంగా ఆ బట్టలు వేస్తుంది, తలదువ్వుతుంది. అహ! ఇంకేం కావాలి తనకి! ఎంతో పొంగిపోయాడు.

భోగిపండగగూడ వచ్చేసింది! రేపే! ఇంకా అక్కరాలేదు ఆలస్యం భరించలేడు పిచ్చెత్తినట్టు ఇంట్లోంచి బయటికి, బయటనించి ఇంట్లోకి తిరుగుతున్నాడు "ఇంకా అక్క రాలేదేమమ్మా?" అని అమ్మ నడిగితే, తలపక్కకి తిప్పుకొని కన్నీరు తుడుచుకొంటుంది. నాన్నమాత్రం ఆ మాట ఎత్తగానే బావమీద తిట్లు ప్రారంభిస్తున్నాడు, ఆయన కేకలకి జడిసి రాము అమ్మని గూడ విస్తారంగా అక్క రాకని అడగటంలేదు.

భోగిపండగ అయిపోయింది—అక్క రాకం దానే! రాత్రి రాముకి నిద్రపట్టలేదు. ఏవేవో కలలు, అక్క వచ్చినట్టు తని పిలచి ముద్దులాడుతూ పాటలు పాడినట్టు, తను మైమరచి ఒళ్లో వూగిపోయినట్టు...కాని తెల్లవారి లేచి చూసుకొనేసరికి పక్కన ఏ అక్కా లేకపోవడంతో, అలా లేచినట్టే తిన్నగా అమ్మదగ్గరికొచ్చి "అమ్మా! అక్కయ్యేదే!" అని అడిగాడు ఆమె ఏమీ జవాబివ్వలేదు. గబుక్కున కౌగిలించుకొని ఏడ్చింది

అమ్మ ఏడుపులు పైకివుటకగానే పక్క గదిలించి నాన్న మూర్జనలువినిపించాయి అమ్మ దుఃఖాన్ని మింగుకోవడానికి వృధాప్రయత్నాలు చేసింది రాముకి ఏమీ అర్థంకాలేదు. ఇక అమ్మనడిగితే లాభంలేదని బయటికెళ్లి అరుగుమీద కూచొని వీధిచివరని పరీక్షగా చూస్తున్నాడు.

అసలు అక్కయ్యెందుకు రాలేదు? దీపావళికి గూడ రాలేదు. బుచ్చిగాడి అక్కయ్య దీపావళికి వచ్చిందట... పోనీ తనే అక్కడికి వెళ్ళాడు. కానీ పండగ చేయలేదేం అక్కడ? ఆ రాత్రంతా అక్క, అమ్మ ఒకదగ్గరే కూచొని ఎంతసేపు ఎంతోసేపు మెల్లగా మాటాడుకొన్నారు అవేమిటో తనకి అర్ధంగాక నిద్రపోయాడు

ఇప్పుడు సంక్రాంతి. అక్క రాదలేదు. ఎవి మిటికూడా కావస్తోంది. రాముకి కళ్లుతిరిగిపోతున్నాయి కడుపులో తిప్పేస్తుంది, ఇక అక్కడ కూచోలేక యింట్లోకివచ్చేశాడు కాళ్ళులాగుతున్నాయి నిలబడలేక మంచంమీద వాలాడు అంతే; కళ్ళు వాట్లంతటవే మూసుకుపోయాయి.

పది అవుతుందనగా అమ్మవచ్చి రామునిలేపింది. ప్రొద్దుటనించి కొడుకు అన్నం తినకపోయినా ఆమాట ఆమెకి జ్ఞాపకమేలేదు పండుగ ఏదోవిధంగా చేస్తోంది గాని మనస్సంతా కూతురు పేపేవుంది, పంచక్కాలు అయిపోయిన తర్వాత యింట్లోకి వచ్చి చూసేసరికి రాము నిద్రపోతున్నాడు లేపాలని నొటిమీద చెయ్యివేసేసరికి శరీరం నిగ్గిలా కాలిపోతోంది. కంగారుగా కొడుకుని తట్టిలేపింది. రాము బరువుగా కళ్ళువిప్పాడు.

"అక్కయ్య ఇంకా రాలేదమ్మా!" అన్నాడు మెల్లగా.

ఆమె కడుపంతా ఒక్కసారిగా కదిలిపోయింది. కళ్ళనించి నీరు జలదరించింది. చేతిలోవున్న కొడుకు ముఖంలో జానకి అగుపించింది

"అక్కయ్య అసలు వస్తుందా?" మళ్లీ అడిగాడు.

తంటపించి పుటికిపోతున్న కన్నీటిని ఆపుకో పోయింది. . కొడుక్కి ధైర్యంచెప్పాలి. అక్క రాదంటే కొడుకు బెగిలి పోతాడు. అందుకు ధైర్యం చెబుతున్నట్లు అంది, "వస్తుందినాన్నా తప్పకుండా వస్తుంది"

"ఎప్పుడు? ఇంకా ఎంతసేపటికి వస్తుంది? బుచ్చి అక్కా బావా మొన్ననే వచ్చేశారు", బుచ్చి అక్కా బావా వస్తే, తన అక్కగూడ వస్తుందనే నమ్మకం అప్పుడు కలిగింది. వాడు అప్పుడు తన అక్కగురించి ఏవేవో చెబుతూంటే రాముగూడ తన అక్కగురించి చెబుతూ ఎగిరిపోయాడు... కాని అక్కఏది?

బయట ఏదో చప్పుడు వినిపించింది. తలుపు వెంటనే తెరుచుకొంది. అమ్మ తలతిప్పి వెనక్కి వెనక్కిచూసింది.

ఎవరో భూతంలాంటి వ్యక్తి. చింపిరితలతో కంచికోకతో "అమ్మా" అని అరచుకొంటూ వచ్చి అమ్మ ఒళ్లో వాలిపోయింది.

రాము పక్కకిచూశాడు. అమ్మ కౌగిలించి ఆమెదృష్టి మంచంమీది రాముమీద పడింది.

"తమ్ముడూ" అంటూ అమ్మనివొదిలి తమ్ముడుపక్కలో యిమిడిపోయింది.

"అక్కయ్యా అక్కయ్యా... నువ్వ.... నువ్వ నిజంగా .. వచ్చావా? అక్కయ్యా"

"అవును తమ్ముడూ, నేనే, నేనే, ఇక నే నెప్పుడూ యిక్కడే వుండిపోతాను. అక్కడికిక వెళ్ళను." అంటూ చిన్నితమ్ముణ్ణి తనివిదీరా ముద్దులాడుతోంది.

అమ్మ పరవశమైపోయింది. ఆమె కళ్ళవెంట ఆనందాశ్రువులు ఝల్లువరాలాయి. గబుక్కునలేచి కూతురురాకని భర్తకిచెప్పటానికి త్వరపడింది వెంటనే భయంగా కూతురుతలకేసి చూసింది. ఆ తలలోరక్తం కరడుగట్టివుంది. పాపకిమాత్రం తమ్ముడు ముద్దుల్లోంచి యింకా తేరుకోనేలేదు.




శరీరము మీద నొప్పులకు తక్షణమే స్వస్థతనిచ్చుటకు

కెంప్‌వారి ఝుట్‌ముట్టో బామ్ రాయుడు

గృహ చికిత్సలకు కెంప్‌వారి ఔషధములు మిక్కిలి ప్రశస్తమైనవి




కెంప్ అండ్ కం. లిమిటెడ్
మాన్యుఫాక్చరింగ్ కెమిస్టులు
బొంబాయి · ఢిల్లీ · మద్రాసు · కలకత్తా